గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల భద్రతకు ప్రత్యేక చట్టం

- బిల్లు ముసాయిదాను ప్రజాభిప్రాయానికి పెట్టండి
- మేడే నుంచి అమల్లోకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేయండి
- కార్మిక శాఖ సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల భద్రత చట్టం దేశానికే మార్గదర్శకంగా ఉండేలా చేయాలని అధికారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల భద్రత బిల్లు ముసాయిదాను ప్రజాభిప్రాయానికి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది ముసాయిదాను రూపొందించాలని సూచించారు. మే ఒకటో తేదీ నుంచి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గిగ్ వర్కర్లు, యూనియన్ల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. అందులో మంత్రులు పొన్నం



ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేష్ రంజన్, సంజయ్‌కుమార్, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం, ఇతర హక్కులను కల్పించేలా రూపొందించిన తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల బిల్లు ముసాయిదాలో పొందుపర్చిన అంశాలను కార్మిక శాఖ అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా పలు మార్పులు,చేర్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వటంతో పాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయం, సుహృద్భావం ఉండేలా కొత్త చట్టం ఉండాలని సూచించారు. ఈ బిల్లు ముసాయిదాను వెంటనే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి, ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్స్ డ్రైవర్లు, ప్యాకేజ్ డెలివరీల్లో దాదాపు నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని, అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంత రాలను స్వీకరించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నాటికి బిల్లు తుది ముసాయి దాను సిద్ధం చేయాలని, అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడే రోజున అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫామ్ వర్కర్ల భద్రతకు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోనే మొదటి సారిగా గిగ్‌వర్కర్లకు రూ.ఐదు లక్షల ప్రమాద బీమాను 2023 డిసెంబర్ 30 నుంచి అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

నేటినుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

- తుది గడువు 30

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజిటెట్) నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. టెట్ పూర్తిస్థాయి నోటిఫికేషన్, సమాచార బులెటిన్‌ను మంగళశారం అధికారిక వెబ్‌సైట్‌లో అధికారులు విడుదల చేస్తారు. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 30 వరకు ఉన్నది. టెట్ దరఖాస్తు ఫీజు కూడా మంగళశారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు చెల్లించడానికి అవకాశమున్నది. పేపర్-1 లేదా పేపర్-2కు దరఖాసు ఫీజు రూ.750, రెండు పేపర్లు రాయాలంటే రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. జూన్ తొమ్మిది నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. అదేనెల 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయి. పరీక్షలు ప్రతిరోజూ రెండు విడతల్లో నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయి. జులై 22న టెట్ ఫలితాలను విడుదల చేస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ప్రజావాణి, ఇ - పోర్టల్ పాదర్శకంగా ఉండాలి

- ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్ నాకివ్వండి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి
- 68.4 శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయి : అధికారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజావాణిలో స్వీకరిస్తున్న అర్జీలతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల వివరాలను ఇ - పోర్టల్‌లో పారదర్శకంగా పొందుపర్చాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రజావాణి డ్యాష్ బోర్డు యాక్సెస్‌ను తనకు అందించాలనీ, ముఖ్యమంత్రికి లైవ్ యాక్సెస్ ఉండేలా ఏర్పాటు చేయాలని సూచించారు. దాంతో తాను ఎక్కడ ఉన్నా ప్రజావాణి అర్జీల పరిష్కారం తీరును, ప్రజల నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వస్తున్నాయో తెలుసుకునే వీలుంటుందన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయటంలో సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్యతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మజ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో వారంలో రెండు రోజులు కొనసాగుతున్న ప్రజావాణిలో ప్రజలు ఇప్పటివరకు సమర్పించిన అర్జీలు, వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? అర్జీల పరిష్కారానికి అధికారులు అనుసరిస్తున్న విధానాలు? మెరుగు కోసం చేపట్టాల్సిన చర్యలేంటి? అనే దానిపై సీఎం సమీక్షించారు. వివిధ విభాగాలకు ప్రజావాణిలో ప్రత్యేక డెస్క్‌లు ఏర్పాటు చేశామనీ, గల్ఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామనీ, వీలైనమేరకు అత్యవసరమైన అర్జీలను పరిష్కరిస్తున్నామనీ, ప్రజావాణి జరిగే రోజుల్లో ప్రజావాణిని అందుబాటులో ఉంచామని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 117 సార్లు ప్రజావాణి నిర్వహించగా అందులో 54619 అర్జీలను ప్రజలు నమోదు చేసుకున్నారనీ, వీటిలో 68.4 శాతం (37384) అర్జీలు పరిష్కారమయ్యాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతూ..ప్రజావాణి అర్జీలను పరిష్కరించేందుకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి డ్యాష్ బోర్డుతో అనుసంధానం చేయాలని చెప్పారు. దీంతో మండలస్థాయిలో, డివిజన్ స్థాయిలో, జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే అంశాలు వెంటవెంటనే అక్కడికక్కడే పరిష్కారమవుతాయని సూచించారు. అర్జీల వివరాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల సమాచారాన్ని ఆన్ లైన్ లో పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వాటి అమలు పురోగతి పారదర్శకంగా అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఉండేలా ఈ-పోర్టల్ రూపొందించాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది లేకుండా అమల్లో ఉన్న చట్టాల ప్రకారం ఏయే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి? వేటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి? అనేదాని ముందే సమీక్షించాలన్నారు. అధికారుల స్థాయిలో కమిటీ వేసి అందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

కెవిపిఎస్ బైక్ ర్యాలీ

- అంబేద్కర్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గోల్కొండ క్రాస్ రోడ్ నుంచి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. "మనువాదం నశించాలి.. రాజ్యాంగం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి నగర అధ్యక్షులు ఎం.దశరథ్ అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి బి.సుబ్బారావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎన్.మారన్న పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు సిఎం నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. సిఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేళాలతో రైతుల్లో చైతన్యం

- ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక మేళాలతో రైతుల్లో చైతన్యం, అవగాహన పెరుగుతాయని టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న 'రైతు మహోత్సవం-2025" రైతు మేళాను ఆయన సోమవారం సందర్శించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ఏర్పాటు చేసిన ఈ మేళాలోని పలు స్టాళ్లను పరిశీలించారు. స్టాల్ నిర్వాహకులు, రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, పండ్లు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు అందించే శాస్త్రీయ విధానాలపై సమగ్ర సమాచారం పొందారు. ఆయనతో పాటు టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులున్నారు.

వర్సిటీలు విలువలను పెంపొందించాలి

- ప్రభుత్వ సలహాదారు కెకె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశ్వవిద్యాలయాలు విద్యా విలువలను పెంపొందించాలని ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కె కేశవరావు (కేకే) అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఎఒయు)లో మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన సామాజిక సాధికారత ఉత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ నైపుణ్యం లేని కార్మికులకు నైపుణ్యత ఇచ్చే ప్రాథమిక లక్ష్యంతో సార్వత్రిక విద్యా వ్యవస్థ, విశ్వవిద్యాలయానికి ఆనాటి మంత్రి హోదాలో తాను రూపకల్పన చేశానని గుర్తు చేసారు. విద్యా విలువలను పెంపొందిస్తూ అందరికీ ఉన్నత విద్యను ఉన్నత ప్రమాణాలతో అందించాలని సూచించారు. 43 ఏండ్ల క్రితం సార్వత్రిక విద్యను అంకురార్పణ చేసే క్రమంలో భాగాస్వామ్యమైన తాను, ఇప్పుడు అంబేద్కర్ వర్సిటీ ఎదిగిన క్రమం చూసి చాలా గర్వపడుతున్నట్టు వివరించారు. రానున్న రోజుల్లో మరింత విస్తరించి సాంకేతిక విద్యా కోర్సులతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. నైపుణ్య కోర్సులు విద్యార్థులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడాలని కోరారు. అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ వర్సిటీలో ఈనెల ఐదు నుంచి 14 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ విశ్వవిద్యాలయాన్ని మరో మూడు దశాబ్దాలకు సరిపడే విధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. వాటికి ప్రభుత్వం ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో తమ బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో నైపుణ్య కోర్సులను అందించేలా రూపకల్పన చేస్తామనీ, ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థలతో అవగాహన ఒప్పందాలను చేసుకుంటామని వివరించారు. ఏటా పది వేల మంది విద్యార్థులను నైపుణ్య విద్యావంతులుగా తయారు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ జి పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్‌వికె రెడ్డి పలు విభాగాల డైరక్టర్లు, డీన్లు, ఆనంద్ పవర్, వడ్డాణం శ్రీనివాస్, పల్లవి కాబ్దే, రవీంద్రనాథ్ సోలోమన్, పి వెంకట రమణ, ఎన్ రజిని, బానోత్ ధర్మా తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక, క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న గోరటి వెంకన్న పాట

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం, ఆరో అడ్వర్టయిజింగ్ సంస్థ సంయుక్తంగా సోమవారం సాయంత్రం ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆధ్వర్యంలో 'గోరటి పాట' సంగీత సంధ్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది అందరినీ ఆకట్టుకున్నది.

ఎక్కడ పిల్లలుంటే అక్కడ ప్రభుత్వ బడి పెట్టాలి

ఆదాయంలో సగానికిపైగా ప్రయివేట్ బడి ఫీజులకే : అలుగుబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడి ద్వారానే అంతరాల్లేని విద్య సాధ్యమవుతుందని, ఎక్కడ పిల్లలుంటే అక్కడ బడి పెట్టాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేదిక నాలుగో రోజు ప్రచార జాతా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ చిలుకానగర్, నాచారం, మల్లాపూర్, మౌలాలి, ఇసిఐఎల్, కుషాయిగూడ, బోడుప్పల్, పీర్జాదిగూడ ప్రాంతాల్లో



ప్రచార జాతాలో మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

సాగింది. అదేవిధంగా, నెక్లెస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద వేదిక సభ్యులు కరపత్రాలు పంచారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ సభ్యులు ఇసిఐఎల్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడి ద్వారా మాత్రమే పిల్లలందరికీ అంతరాల్లేని విద్య సాధ్యమౌతుందని, ఈ విషయాన్ని ఆనాడే రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపర్చారని చెప్పారు. నేడు ప్రభుత్వ విద్యారంగం పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నదన్నారు. అమెరికా వంటి సంపన్న దేశాల్లో విద్య ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తుంటే, రాష్ట్రంలో ప్రయివేటుమయం కావడం బాధాకరమన్నారు. ఉపాధి కోసం యువ దంపతులు, మధ్యతరగతి ప్రజలు పట్టణాలకు తరలిరావడంతో పట్టణాల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిపోయినా, అందుకనుగుణంగా బడులు పెంచడం లేదన్నారు. గత్యంతరం లేక తల్లిదండ్రులు ఆర్థిక భారాలకోర్చి పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపుతున్నారన్నారు. చేసిన కష్టంలో సగ భాగం పిల్లల చదువులకే ఖర్చు పెట్టడం వల్ల వారికి పౌష్టికాహారం పెట్టలేని దీన స్థితిలోకి కుటుంబాలు నెట్టబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడ పిల్లలుంటే అక్కడ బడి పెట్టాలని, ప్రభుత్వ బడుల్లో కనీస సౌకర్యాలు కల్పించి, అందరికీ నాణ్యమైన, ఉచిత విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో ప్రయివేటు బడుల కంటే మంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులున్నారని, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని, నివాస ప్రాంతాల్లో బడి లేకపోతే కొత్త బడి పెట్టాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాయాలని సూచించారు. అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, ప్రగతిశీల శక్తులు, రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2025 జూన్ నుంచే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలన్నింటిలో ప్రీ-ప్రైమరీ (ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులు ప్రారంభించాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ఆయా బడుల్లోనే వండించి పెట్టాలని కోరారు. ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎం.మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్ సమార్, సుధాకర్, ధనమూర్తి, నాగమణి, లక్ష్మణ్ రావు, రామక్రిష్ణ, రాములు, టిఎస్‌యుటిఎఫ్ నాయకులు నీరజ, రాజేష్, ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

- మనువాదాన్ని తిప్పి కొట్టాలి
- జాన్‌వెస్లీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపిని ఒంటరిపాటు చేయాలనీ, అందుకవసరమైన సమయం ప్రస్తుతం ఆసన్నమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గల ఆయన విగ్రహానికి వెస్లీ పూలమాలలేసి నివాళులర్పించారు. పాతబస్తీలోని ఛార్మినార్ ముందు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనువాదాన్ని తిప్పికొట్టి, బిజెపిని ఒంటరి చేసే సమయం ఆసన్నమైందని గుర్తుచేశారు. సామాజిక న్యాయం, లౌకిక భావాలను, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం కోసం ఈ నెల 11 నుంచి అంబేద్కర్ జయంతి వరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన సభలు, కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం కంటే ఎక్కువగా మనుధర్మ శాస్త్రాన్నే ముందుకు తెస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు కుల వివక్షకు, దాడులకు, హత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల వాకిటి ఇప్పటికీ దేవాలయాల్లోకి ప్రవేశం లేదని చెప్పారు. ఎస్సి, ఎస్‌టి, బిసి, అగ్రకుల పేదలకు కూడా రిజర్వేషన్లు అమలువుతున్న ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ మోడీ సర్కార్ ప్రయివేటుపరం చేసి, రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నదని విమర్శించారు. పేద, ధనిక వ్యత్యాసాలు కొనసాగుతున్నాయని, కొద్దిమంది కార్పొరేట్, పెట్టుబడిదారులే దేశ సంపదనంతా కొల్లగొట్టుకు పోయే విధానాలను బిజెపి అనుసరిస్తోందని తప్పుపట్టారు. మహిళల మీద దాడులు, హత్యలు, లైంగికదాడులు పెరిగపోయాయని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకోవాలనీ, ప్రయివేటు రంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్ల కోసం చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఛార్మినార్ ఎదుట డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

దేశవ్యాప్తంగా బిసిల జనాభా, ఆర్థిక, విద్యా వివరాలు తెలుసుకునేందుకు కులగణన జరపాలని ప్రతిపక్ష పార్టీలన్ని కోరుతున్నా బిజెపి వ్యతిరేకిస్తున్నదని వెస్లీ ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాల అమల్లో లోపాలున్నాయనీ, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని విమర్శించారు. గ్యారెంటీలకు కావాల్సిన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదని, అసైన్డ్ భూములను, పేదల భూములను అన్యాయంగా లాక్కుని, కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్తుందని ఎండగట్టారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రజలు పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఇక్కడ అనుకూలం.. అక్కడ వ్యతిరేకం
కేంద్ర మంత్రులపై జాన్ వెస్లీ ఆగ్రహం

రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు... రాష్ట్రంలో కులగణనకు అనుకూలంగా మాట్లాడి, కేంద్రంలో మాత్రం వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని జాన్ వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు రాజ్యాంగాన్ని పక్కకు పెట్టి మైనార్టీల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నాయని విమర్శించారు. వారికి నష్టం కలిగించే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు తెచ్చారని గుర్తుచేశారు. ఇది ముస్లీముల ఆస్తులతోనే ఆగిపోదని, తర్వాత క్రిష్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, ఇతర మతస్తుల ఆస్తులను, చివరకు హిందు మతస్తుల ఆస్తులను కూడా స్వాధీనం చేసుకుని కార్పొరేట్లకు, దోపిడీదారులకు కట్టబెడతారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో లౌకిక భావాలను కాపాడడానికీ, మనువాదాన్ని తిప్పికొట్టడానికీ, రాజ్యాంగ హక్కులను నిలబెట్టుకోవడం కోసం లౌకిక శక్తులన్నీ ఏకం కావాలనీ, బిజెపిని ఒంటరి చేయాలని సిపిఎం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మహ్మద్ అబ్బాస్, ప్రజాసంఘాల నాయకులు ఎం.వి.రమణ, మూడ్ శోభన్, కోట రమేశ్, ఉడత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం

- పంటలకు దక్కని మద్దతు ధరలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లె ప్రజా పోరుబాట- పాదయాత్ర' సందర్భంగా మునుకుంట్లలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలతో అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని చెప్పారు. మోడీ అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తారని హామీ ఇచ్చారని, కానీ నేడు రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా నల్ల చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నించారని వివరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి 16 నెలలు గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. రైతు భరోసా, రుణమాఫీలకు కొర్రిలు పెట్టిందన్నారు.కట్టంగూర్ మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చుట్టూ నీటి వనరులు ఉన్న వాటిని రైతులకు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నిజాం కాలం నుంచి ఉన్న ఆసిఫ్‌నగర్ కాలువ ద్వారా చెరువులను నింపాలని, ఎస్-ఎల్‌బిసి కాలువ ద్వారా సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, పాదయాత్ర బృందం సభ్యులు, సిపిఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు ఊట్కూరి శ్రీను, చిలుమల రామస్వామి, మురారి మోహన్, జాల రమేష్, గర్ధ సతీష్, ఊట్కూరు సుజాత, గడగొజు రవీంద్రచారి, జాలా అంజనేయులు, చిలుకూరు సైదులు, లక్ష్మయ్య, మూసుకు రవీందర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.



యాదాద్రికి రెండు విద్యుత్ వాహనాల విరాళం

- అందజేసిన ఎస్‌బిఐ చైర్మన్ సిఎస్ శెట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్

యాదాద్రి గుడికి ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రెండు ప్రత్యేక విద్యుత్ వాహనాలను విరాళంగా ఇచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)లో భాగంగా వీటిని సోమవారం ఆ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అందజేశారు. గుడి సమీపంలో ఈ వాహనాలు ముఖ్యంగా వృద్ధులకు, మహిళలకు, నడవలేని వారికి సహాయంగా ఉంటాయని ఆ బ్యాంక్ తెలిపింది. ఎస్‌బిఐ సిఎస్‌ఆర్ సేవలు చాలా అర్థవంతంగా ఉంటాయని చెప్పడానికి గర్వపడుతున్నామని సిఎస్ శెట్టి పేర్కొన్నారు. ఎస్‌బిఐ అందించిన విద్యుత్ వాహనాలు భక్తులకు అదనపు మద్దతును అందించనున్నాయని యాదాద్రి ఇఒ ఎ భాస్కర రావు అన్నారు. పర్యావరణహిత పరిష్కారాలకు ఎస్‌బిఐ మద్దతుగా నిలువడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, ఆ బ్యాంక్, గుడి అధికారులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో రెండేళ్ల బాలుడికి సంక్లిష్టమైన క్యాన్సర్‌కు చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

కిమ్స్‌లో రెండేళ్ల బాలుడికి సంక్లిష్టమైన క్యాన్సర్‌కు చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మధు దేవరశెట్టి తెలిపారు. హైదరాబాద్ లాలాపేట్ ప్రాంతానికి చెందిన రక్షిత్ అనే ఆ రెండేళ్ల అబ్బాయికి న్యూరోబ్లాస్టోమా చాలా ముదిరిన దశలో సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్చారని సోమవారం డాక్టర్ మధు దేవరశెట్టి మీడియాతో తెలిపారు. "సాధారణంగా 15 ఏళ్లలోపు పిల్లలకే వచ్చే న్యూరోబ్లాస్టోమా అనే ఈ క్యాన్సర్.. పది లక్షల మంది పిల్లల్లో కేవలం ఎనిమిది మందికే కనిపిస్తుంది. ఇది అడ్రినల్ గ్రంథి (మూత్రపిండాల పైన) నరాల కణజాలంలో ప్రారంభమవుతుంది. ఇంకా ఇది మెడ, ఛాతీ లేదా పెల్విస్ యొక్క నరాల కణజాలాలలో కూడా ప్రారంభమవుతుంది. దాంతో అతడికి శస్త్రచికిత్స చేయడం చాలా సంక్లిష్టంగా మారింది. తొలుత కీమోథెరపీతో కొంతవరకు నయం చేయచ్చేమో అనుకున్నాం. కానీ, దానికి కణితి ఏమాత్రం స్పందించలేదు. దాంతో శస్త్రచికిత్స తప్పనిసరైంది. కానీ, కణితి తొలగించేటప్పుడు కిడ్నీ కూడా తీసేయాల్సి వస్తుందేమో అనిపించింది. కానీ, మా బందంలోని వైద్యులంతా అత్యంత నైపుణ్యంతో, ఎంతో కష్టపడి.. చివరకు కిడ్నీని తీయకుండా చూడగలిగాం. ప్రభావితమైన రక్తనాళాలను జాగ్రత్తగా తీసేసి, వాటిని మళ్లీ అనుసంధానించాం. ఫలితంగా రక్తసరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకున్నాం." అని డాక్టర్ మధు దేవరశెట్టి తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర

- దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులదే
- రాహుల్ గాంధీని తిరోగమనవాది అనడాన్ని ఖండించిన భట్టి
- అంబేద్కర్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతరత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్య ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. రాజ్యాంగమే సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని చెప్పారు. అంబేద్కర్ అందించిన సంవిధాన్ బచావో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. దేశంలో కులగణన సర్వే చేసి జనాభా దామాషా ప్రకారంగా సంపద, వనరులు, రాజకీయ అవకాశాలు పంచాలని సామాజిక న్యాయం కోసం ఆలోచన చేస్తున్న రాహుల్ గాంధీని తిరోగమన వాది అనడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న ప్రజాస్వామిక వాదులు, ఓటు హక్కుతోపాటు ఇతర హక్కులు పొందుతున్న ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో కుల గణన చేసి బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాహుల్ గాంధీ చేస్తున్న ఆలోచన ప్రకారం మొట్ట మొదటిసారి రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే చేయించి, ఆ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపించడమే కాకుండా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాము అందరం ఢిల్లీకి వెళ్లి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటూ కేంద్రాన్ని కోరామన్నారు. ఇది దేశ వ్యాప్తంగా అమలు చేయాలని ప్రయత్నం చేసి సామాజిక విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని వివరించారు. బిజెపి, బిఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసినా 42 శాతం రిజర్వేషన్ సాధించుకోవడం కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతోపాటు బహుజనులందరు ఏకమవుతారని అన్నారు. ఈ ప్రభుత్వానికి, రాహుల్ గాంధీకి ప్రజలందరూ అండగా ఉంటారని చెప్పారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి

విద్యుత్ సంస్థల స్థాపనకు రూపకల్పన చేసిన అంబేద్కర్

- మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ సంస్థల స్థాపనకు రూపకల్పన చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖరరావు అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ అధ్యక్షతన 'అంబేద్కర్ ఆలోచనలు-కార్మిక చట్టాలు-4 లేబర్ కోడ్లు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆర్థికవేత్త, సామాజికవేత్త, పేదల పెన్నిదన్నారు. బడుగు బలహీన వర్గాలు, దళితులు, కార్మికులు, మహిళలకు రాజ్యాంగ ప్రాథమిక హక్కులు కావాలని పోరాటాలు, ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కులనిర్మూలన అనే గ్రంథం రాసి కొలంబియా విశ్వవిద్యాలయం లండన్ స్కూల్ ఆఫ్ ఎకానిమక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్‌లో డాక్టరేట్లు పొందిన మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షులు పి.పేంప్రావని, కార్యదర్శి కరుణ కుమారి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, అధ్యక్షులు కె రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా నాయకులు పి వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

అంబేద్కర్ ఆశయాలు ఆదర్శం

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయమనీ, ఆచరణీయమని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మహేశ్ కుమార్ గౌడ్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు కొనసాగించడమే నిజమైన నివాళి అనీ, అంబేద్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని గుర్తుచేశారు. అంబేద్కర్ ప్రేరణతో రాష్ట్రంలో కాంగ్రెస్ సుపరిపాలన అందిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ పిసిసి అధ్యక్షులు వి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

అవధాన ప్రక్రియలో పిజి డిప్లొమా

- తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య నిత్యానందరావు

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు భాషా సంపద ఇన అవధాన ప్రక్రియలో పిజి డిప్లొమా కోర్సును ప్రవేశ పెట్టే యోచన చేస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ఆచార్య నిత్యానంద రావు తెలిపారు ఇందుకోసం అవధాన విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న అవధాన విద్యా పరిషత్‌తో తెలుగు విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంటామని అయన ప్రకటించారు. గత రెండు రోజులుగా తెలుగు విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రజ పద్యం సంస్థ, అవధాన విద్యా వికాస్ పరిషత్ నిర్వహణలో జరుగుతున్న శతావధాని డాక్టర్ మారేపల్లి వెంకట రమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం ముగింపు విజయోత్సవ సభ జరిగింది పట్వర్ధన్ మూడు రోజుల పాటు 108 మంది పృచ్ఛకులు అడిగిన సమస్య దత్తపది వర్ణన న్యస్తక్షరి నిషిద్ధక్షరి ఆశువు అంశాలకు దీటుగా ధార ధారణ సముచిత రీతిలో పద్య వర్షం కురిపించారు అనంతరం జరిగిన సభలో ఆచార్య నిత్యానంద రావుతో పాటు ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాద్‌రావు పాల్గొని అవధాన విద్య ప్రతిష్ఠ పట్వర్ధన్ వంటి వారి వల్ల ద్విగుణీకృతం అవుతుంది అని అభినందించారు శాసన సభ్యుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి, బిజెపి నాయకులు గీతా మూర్తి,ఆచార్య కోట్ల హనుమంత రావు వనం జ్వాలా నరసింహారావు తదితరులు పాల్గొని పట్వర్ధన్‌ను శతావధాన ద్యుమణి బిరుదుతో సత్కరించారు అవధాన నిర్వహణ సంఘ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె వి రమణ తమ అభిందన తెలుపుతూ అవధాన విద్య ప్రక్రియ ను విశ్వవిద్యాలయం లో కోర్సు గా ప్రవేశ పెట్టే యోచనకు తన సందేశం హర్షం వ్యక్తం చేశారు అధ్యక్షులు వెంకట అనంత కృష్ణ కార్యదర్శి దత్తా త్రేయ శర్మ , వెంకట రమణ శర్మ ఆముదాల మురళీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు పట్వర్ధన్ తొలుత అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని పద్య మాలలు సమర్పించారు

జర్నలిస్టులపై మీకున్న అవగాహన ఇదేనా?

- టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులవి అనాలోచిత వ్యాఖ్యలు
- టిడబ్ల్యుజెఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు రఘుపతి, గణేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల సమస్యలు, జర్నలిస్టుల సంఘాల గురించి తెలియని టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులు ఆనాలోచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీనియర్ జర్నలిస్టులు, రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు రఘుపతి, గణేష్ అన్నారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, కార్యదర్శి మేకల సత్యనారాయణ తమపై చేసిన వాఖ్యలు... జర్నలిస్టుల సంఘాలతో వారికి ఉన్న అవగాహన, సంబంధాలకు నిదర్శనమని చెప్పారు. 25 ఏళ్ల పాటు టియుడబ్ల్యుజె (ఐజెయు) పని చేసిన తమను గుర్తుపట్టని నాయకులు ఐజీయు సంఘానికి జిల్లా నాయకులయ్యారంటే సిగ్గు చేటు అని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష స్థాయిలో ఉన్న నాయకుడు తమ సంఘంలో ఎవరికి సభ్యత్వం ఉంది.. ఎవరికి లేదు.. సంఘంలో ఎవరు ఏస్థాయిలో పనిచేశారు అనేది తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని పేర్కొన్నారు. ఎవరు ఏ సంఘంలో ఏ హొదాలో పని చేశారనేది జిల్లాలో జర్నలిస్టులకు తెలుసని తెలిపారు. ఆఫీసు మెట్లు మేము ఎక్కటం పక్కనపెడితే... జిల్లా అధ్యక్షుడుగా ముందు మిమ్మల్ని మీ నాయకులు పరిచయం చేస్తే సంతోషమని పేర్కొన్నారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు కొంత అవగాహనతో మాట్లాడితే బాగుటుందని ఐజెయు నాయకులకు వారు హితవు పలికారు.

క్వారీలో ముగ్గురు యువకులు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈత కోసం క్వారీలో దిగిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. అందులో ఒకరి మృతదేహం లభ్యమయ్యింది. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. ఈ విషాద ఘటన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో దివిటిపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దివిటిపల్లిలోని డబుల్ బెడ్ రూముల ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు సోమవారం మధ్యాహ్నం సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద క్వారీలో ఈత నేర్చుకోవడానికి వెళ్లారు. క్వారీలో దిగగానే ఈత రాకపోవడంతో అయ్యప్ప, మహమూద్, విజయ్ నీటిలో మునిగిపోయారు. స్థానికులు కొంతమంది గమనించి వెంటనే క్వారీ దగ్గరికి వెళ్లి విజయ్ మృతదేహాన్ని వెలికి తీశారు. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.



కెఎల్‌హెచ్ జిబిఎస్‌లో టెక్నో ఆర్ట్ ఫెస్ట్ విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్

కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కెఎల్‌హెచ్ జిబిఎస్) తమ కొండాపూర్ క్యాంపస్‌లో యానిమేషన్ అండ్ గేమింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెక్నో ఆర్ట్ ఫెస్ట్ అయిన సజన 2025ను విజయ వంతంగా నిర్వహించినట్లు తెలిపింది. ఇది విద్యార్థులకు వాస్తవ ప్రపంచ అనుభవాలను పొందటానికి రూపొందించబడిన శక్తివంత మైన వేదికని ఆ సంస్థ పేర్కొంది. ఈ కార్య క్రమంలో గ్రీన్ గోల్డ్ యానిమేషన్ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ వై, క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణ మోహన్, ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ లెన్నీ ఇమాన్యుయేల్ వంటి ప్రముఖ పరిశ్రమ నిపుణులు హాజరయ్యారని తెలిపింది. విద్య సాంప్రదాయ సరిహద్దులను అధిగమించి, విద్యార్థులు ఆలోచించడానికి, సృష్టించడానికి, సాధికారత కల్పించాలని విశ్వసిస్తున్నామని కెఎల్‌ఇఫ్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ పేర్కొన్నారు.

జెబిఎల్ నుంచి ట్యూన్ సిరీస్2 ఆవిష్కరణ

హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ జెబిఎల్ కొత్తగా ట్యూన్ సిరీస్2ను ఆవిష్కరించింది. సుపీరియర్ సౌండ్, బ్లూటూత్ 5.3, ఎల్ఇ ఆడియో టెక్నాలజీతో అసాధారణ కనెక్టివిటీ ఫీచర్లతో అందిస్తోన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఏప్రిల్ 17 నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొంది. వీటి ధరలు రూ.9,499గా ప్రారంభమవుతాయని తెలిపింది.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎఫ్‌టిసిసిఐ నాయకులు

ఎఫ్‌టిసిసిఐ అవార్డులకు ఎంట్రీల ఆహ్వానం

- 21 విభాగాల్లో దరఖాస్తుకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ పారిశ్రామికవేత్తల వేదిక తెలంగాణా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) తన ప్రతిష్టాత్మక వార్షిక ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025ను ప్రకటించింది. 21 విభాగాల్లో నామినేషన్లు అహ్వానిస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తి కలిగిన సంస్థలు, వ్యక్తులు మే 10వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. సోమవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. జూన్‌లో అవార్డుల ప్రదానోత్సవానికి సిఎం రేవంత్ రెడ్డిని అహ్వానిస్తున్నామని చెప్పారు. గత 50 ఏళ్లుగా తాము ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. ఈ దఫా పలు రంగాలతో పాటు వ్యక్తిగత అవార్డులను కూడా ఇవ్వనున్నామన్నారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మహిళ ఔత్సాహికవేత్తలు, సామాజిక రంగం, వికలాంగుల స్వియ అభివృద్ధి తదితర వాటిలో విశేష సేవలందిస్తు పేరొందిన వారికి గుర్తింపును ఇవ్వనున్నామన్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఎంట్రీల సంఖ్య పెరగనుందన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌టిసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, అవార్డ్స్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గరిమెళ్ల తదితరులు పాల్గొన్నారు.

పార్క్ హయత్ హోటల్‌లో అగ్ని ప్రమాదం

- సన్‌రైజర్స్ ఆటగాళ్లకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డు నెం-2లోని పార్క్‌హయత్ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఇదే హోటల్‌లో ఆరో అంతస్తులో సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెట్ టీమ్ బస చేస్తుండటంతో ఈ ఘటన సంచలనం రేపింది. వివరాల్లోకెళ్తే.. సోమవారం పార్క్‌హయత్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో హెూటల్ అంతా దట్టంగా పొగలు అలముకున్నాయి. వెంటనే హోటల్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే హోటల్‌లోని ఆరో అంతస్తులో కొన్ని రోజులుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు, సపోర్టింగ్ స్టాఫ్ బస చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత వారిని అక్కడి నుంచి రెండు బస్సుల్లో వేరే చోటుకు తీసుకెళ్లారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హోటల్ మొదటి అంతస్తులోని విద్యుత్ వైర్లు కాలడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం.



మేకలు, గొర్రెల మందపై కుక్కల దాడి

- 30 మూగజీవాలు మృత్యువాత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేకల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 30 మూగజీవాలు మృత్యువాత పడ్డ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు దండేటీకర్ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కోసం తెచ్చుకున్న మేకలు, గొర్రెలను రోజులాగే మేపి రాత్రి ఇంటి సమీపంలోని తన షెడ్డులో పెట్టాడు. రాత్రి వేళలో సుమారు ఎనిమిది కుక్కలు మేకల మందలోకి చొరబడి దాడి చేశాయి. దాంతో సుమారు 30 జీవాలు మృత్యువాత పడి రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. అప్పు తెచ్చి కొనుక్కొచ్చిన జీవాలు మృత్యువాత పడటంతో ఉపాధి కోల్పోవడమే కాకుండా అప్పుల్లో కూరుకుపోయామని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు. గతంలో కూడా కుక్కలు దాడి చేయడం వల్ల తన ఐదు మేకలు మృత్యువాతపడ్డాయని, ఇప్పుడు 30 మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుని, తనకు తగిన న్యాయం చేయాలని బాధితుడు కోరారు.